క్లుప్తంగా

108 సేవలపై ఆరా



అంబులెన్స్‌లో పరికరాల పనితీరును తనిఖీ చేస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: ప్రజలకు ఎల్లవేళలా 108 సేవలు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని జిల్లా 108 ఏఈఎంఎస్ ఎగ్జిక్యూటివ్ ఎస్. నవీన్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న అంబులెన్స్‌లో వివిధ రకాల ఎక్విప్‌మెంట్, సిబ్బంది పనితీరుపై మంగళవారం ఆరా తీశారు. స్థానిక వైద్య సిబ్బంది సహకారంతో ఫోన్ చేసిన వెంటనే ప్రజలకు సేవలందించే దిశగా పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఈఎంటీ టి.వెంకటేశ్వర్లు, పైలెట్ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం సీతంపేటకే పరిమితం చేయొద్దు



మాట్లాడుతున్న వాబ యోగేశ్వరరావు

సారవకోట: ఆదివాసీ దినోత్సవాన్ని సీతంపేటకు మాత్రమే పరిమితం చేస్తున్నారని, శ్రీకాకుళం జిల్లాలోని పలు గిరిజన మండలాలు, గ్రామాలున్నాయని అక్కడ కూడా నిర్వహించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతిఏటా సీతంపేటలో మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని మెళియాపుట్టి, పాతపట్నం, మందస మండలాల్లో ఏదో ఒకచోట ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని కోరారు.

చురుగ్గా రహదారి నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

సారవకోట: పాతపట్నం మండలంలోని తెంబూరు నుంచి సారవకోట మండలంలోని పెద్దలంబ, బొంతు జంక్షన్ మీదుగా హిరమండలం రహదారి పనులు చపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి గతంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శంకుస్థాపన చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు మందకొడిగా సాగాయి. దీంతో ఇటీవల ఈ రోడ్డును ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయం తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయనున్నామని ఆర్అండ్‌బీ ఏఈ యోగేశ్వరరావు తెలిపారు.


స్వమిత్వ సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రమణ

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాలను గుర్తించేందుకు చేపట్టిన స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలని టెక్కలి డివిజన్ డీఎల్‌పీఓ ఐ.వి.రమణ ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ కార్యదర్శులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామిత్వ సర్వే చేయటం పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో రోడ్లుకు ఇరువైపులా, చెత్త సేకరణ కేంద్రాల వద్ద, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సంపద తయారు చేయాలన్నారు. పంచాయతీలకు ఆదాయం తెచ్చిపెట్టే మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈఓపీఆర్డీ శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలి



వరి పంటకు ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

నరసన్నపేట: మండలంలోని రైతులందరూ విధిగా ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. మండలంలోని సత్యవరంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి అన్ని ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ప్రతిరైతూ సంబంధిత వీఏఏల వద్దకు ఆధార్ కార్డు పట్టుకుని వెళ్లాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బూర్జ: ఓపీవాడలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

బూర్జ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, ఇదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయమని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో గల ఓపీవాడ, ఓవీపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, అధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాలను సంప్రదించాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో ప్రతీ కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్న సీఎం జగన్ మనసున్న మారాజు అని, గడప వద్దకే పాలన తీసుకు వచ్చి దేశంలోనే అత్యుత్తమ సీఎంగా చరిత్ర సృష్టించారన్నారు. ఓపీవాడ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు వైఎస్సార్ పోషణ కిట్లు అందజేశారు. మురుగు కాలువలు నిర్మాణం చేపట్టాలని స్పీకర్‌ను గ్రామస్తులు కోరారు. కాలనీ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని పలువురు విన్నవించారు. ఈ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను స్పీకర్ ఆదేశించారు. తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సింగుపురపు కోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి ..

పాతపట్నం: ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని గ్రామ సచివాలయ-3 పరిధిలోని రాజీవ్‌నగర్, కోర్టువీధి, వేంకటేశ్వర కాలనీలో మంగళవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించారు. ప్రతీ ఇంట్లో ఆయా కుటుంబ సభ్యులకు చేకూర్చిన ప్రయోజనాన్ని వివరిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖను అందజేశారు. ఇళ్ల స్థలాలు, కాలనీలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను పలువురు మహిళలు కోరారు. వెంటనే దరఖాస్తులు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఈఓ కూర్మారావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జునుడు, తాతయ్య, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, వై.వెంకటరమణ, బి.నారాయణరావు, దొర పార్వతీశం, ఎం.వరదరాజులు, రాజు, ధనుంజయ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పాతపట్నం: రాజీవ్‌నగర్‌లో మహిళలకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఓటర్ సర్వే ప్రక్రియ వేగవంతం



రాజకీయ పార్టీ నాయకులకు సూచనలిస్తున్న ఆర్డీఓ శాంతి

ఆమదాలవలస రూరల్: ఇంటింటా నిర్వహిస్తున్న ఓటర్ల సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్డీఓ, ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారి బి.శాంతి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఓటర్ సర్వేపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ సర్వే చేసే సమయంలో గ్రామాల్లో సంబంధిత బీఎల్వోతోపాటు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొని సర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 49 శాతం వరకు సర్వే పూర్తిచేయడం జరిగిందన్నారు. కొత్త ఓట్ల నమోదుకు 859 మంది, మరణించిన ఓట్లు తొలగించేందుకు 239 మంది, ఓటరు జాబితాలో తప్పులు సరిదిద్దేందుకు 2,849 మంది దరఖాస్తులను అందజేశారన్నారు. నియోజకవర్గంలో కొన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో సర్వే అలస్యం జరుగుతుందని, దీనిపై సంబంధిత తహసీల్దార్‌ల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. తహసీల్దార్లు గణపతిరావు, ప్రసాదరావు, రమేష్‌కుమార్, రమణారావు, ఎలక్షన్ డీటీ మురళీధర్‌నాయక్ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిశీలన

సరుబుజ్జిలి: జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ తెలిపారు. మండలంలోని కొండవలస, రొట్టవలస, రావివలస, పెద్దపాలెం, పాలవలస గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గృహనిర్మాణశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, సర్పంచ్‌లు లావేటి విశ్వేశ్వరరావు, వండాన కృష్ణ, గజ్జన మోహనరావు, సర్దరి గురువులునాయుడు, కుసుమంచి హరీష్ పాల్గొన్నారు.



కొండవలసలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న చిరంజీవినాగ్, అధికారులు

మంత్రి ధర్మాన సోదరుల పరామర్శ



తవిటిరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: మండలంలోని చిన్న బొరిగివలస మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పొన్నాన తవిటిరాజు కుటుంబ సభ్యులను మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మంగళవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం తవిటిరాజు గుండెపోటుతో మృతి చెందారు. తవిటిరాజు భార్య సుమతి, కుమారుడు సతీష్ కుమార్(చిన్ని), కుమార్తెలు సుజాత, సునీత, సోదరుడు దాలినాయుడును పరామర్శించి ధైర్యం చెప్పారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మంచి మిత్రుడుని కోల్పోయానని మంత్రి ధర్మాన అన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, రాజాపు అప్పన్న, ఎం.కృష్ణ తదితరులున్నారు.

ఇంటింటికీ తాగునీటి సౌకర్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించే సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రాధాకృష్ణాపురం, కామిరెడ్డిపేట, శ్రీహరిపురం, గోవిందపురం గ్రామాల్లో రూ.1.31 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిల కార్యక్రమానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతి వంటి సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వాటర్ ట్యాప్ కనెక్షన్ ఇచ్చి తాగునీటిని అందించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యంగా జీవించాలంటే సురక్షితమైన నీటిని తాగాలని, అటువంటి తాగునీరు ఇంటి ముంగిటకే సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతిఒక్కరూ ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొండేటి సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు మొండేటి కూర్మారావు, బొడ్డేపల్లి రాజశేఖర్, పేడాడ శ్యామ్, కామిరెడ్డి రమణ, బొడ్డేపల్లి రామకృష్ణ, గొంటి కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, జేఈ చంద్రమౌళి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీహరిపురంలో తాగునీటి కుళాయిలకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్

పొందూరు: మండలంలోని రెండు పంచాయతీల్లో వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీఓ ఎస్.హరిబాబు మంగళవారం తెలిపారు. పొందూరులో 14వ వార్డు సభ్యుడు అనకాపల్లి అక్కలనాయుడు, గోకర్నపల్లి పంచాయతీలో వార్డు సభ్యుడు గురుగుబెల్లి రమణ మృతి చెందడంతో ఈ రెండు వార్డులకు నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. పొందూరు రిటర్నింగ్ అధికారిగా పీవీ రామరాజు, గోకర్నపల్లి రిటర్నింగ్ అధికారిగా ఆంజనేయనాయక్‌ను నియమించారన్నారు. మంగళవారం ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఎంపీడీఓ ఎస్.హరిబాబు తెలిపారు.

పది లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

పాతపట్నం: పాతపట్నం మండలంలోని కన్నయ్యపేట గిరిజన గ్రామం సమీపంలో 10 లీటర్ల సారాతో దాసుపురం నారాయణరావును పట్టుకున్నామని ఎస్ఈబీ ఎస్ఐ దస్తగిరి మంగళవారం తెలిపారు. సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నారాయణరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

విలేకరిపై దాడి కేసులో ఒకరి అరెస్టు

నరసన్నపేట: మండలంలోని కొల్లవానిపేటలో జలుమూరు సాక్షి విలేకరి (శాంతభాస్కర్)పై దాడి చేసి కంటిపై తీవ్రంగా గాయపరిచిన కేసులో కొల్ల చిరంజీవులను అరెస్టు చేసినట్టు నరసన్నపేట ఎస్ఐ వైసింహాచలం మంగళవారం తెలిపారు. జూన్ 29న పొలం వద్దకు పిలిచి..కొల్ల చిరంజీవులు, దిలీప్ దాడి చేసినట్లు అప్పట్లో శాంతభాస్కర్ ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు విచారణ చేపట్టామన్నారు. శాంతభాస్కర్‌కు తగిలిన గాయానికి సంబంధించి వైద్యుడు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా చిరంజీవులను సోమవారం అరెస్టు చేశామన్నారు. ఈ నెల 18 వరకు రిమాండ్ విధించారన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

హిరమండలం: ఉద్యోగ వృత్తిలో చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని కొమనాపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీప్రకాష్, స్థానిక సర్పంచ్ గోవిందరావు అన్నారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఎం.షణ్ముఖరావు, ఎం.మహారాణి, జి.దేవసేన, సి.హెచ్.పద్మావతిని మంగళవారం సన్మానించారు. యూటీఎఫ్ నాయకులు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఉపకరణాల గుర్తింపు శిబిరం

ఆమదాలవలస రూరల్: మండలంలోని మార్కెట్ కమిటీ మార్టు ఆవరణలో బుధవారం ఉదయం నుంచి విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల బహుళ ప్రయోజన గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అలిమ్-కో సంస్థ సహకారంతో ఉచితంగా ఉపకరణాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిజిటల్ బోధనపై అవగాహన

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన ప్రారంభమైందని, దీనిపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన ఉండాలని నరసన్నపేట ఎంఈఓ దాలినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాతపట్నం, నరసన్నపేట, పోలాకి, సారవకోట, జలుమూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)పై శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. కోర్సు కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న ఎంఈఓ దాలినాయుడు ఫ్లాట్ ప్యానెల్ ప్రాముఖ్యతను వివరించారు. డిజిటల్ బోధనా పద్ధతులు, ఫ్లాట్ ప్యానెల్ వినియోగంపై డీఆర్పీలు రవికుమార్, వై.అప్పలనాయుడు అవగాహన కల్పించారు. మరో మూడు రోజులు శిక్షణ తరగతులు ఉంటాయని ఎంఈఓ తెలిపారు.

జగనన్న కాలనీలు త్వరితగతిన పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



గృహనిర్మాణశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: నియోజకవర్గంలో జగన్న కాలనీలతో పాటు స్వంత స్థలాల్లో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లుకు నరసన్నపట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని గృహ నిర్మాణాలపై మంగళవారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లో గృహ నిర్మాణాల స్థితిగతులపై సమీక్ష చేశారు. నరసన్నపేట మండలానికి సంబంధించి గడ్డెయ్యపేట వద్ద ఇళ్ల నిర్మాణం ఎలా ఉంది, ఎంత మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారనేది డీఈ రామ్మూర్తిని అడిగి తెలుసుకున్నారు. గడ్డెయ్యపేట జగనన్న కాలనీని జిల్లాలోనే మోడల్‌గా తీసుకోవడం జరిగిందని, ఈ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పన పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సౌకర్యం, ఇంటింటికీ కళాయిలు వేశామని డీఈ వివరించారు. కళాయిలకు కనెక్షన్ ఇవ్వాల్సి ఉందన్నారు. లబ్ధిదారులందరితో ఎప్పటికప్పుడు మాటాడుతున్నామని తెలిపారు. పోలాకి, జలుమూరు మండలాల్లో ఇళ్ల నిర్మాణంపై కూడా ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుప్పడిపేటలో అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ పీడీ గణపతి, ఏఈలు పోలాకి గురునాథరావు, జలుమూరు బి.గోపికృష్ణ, సారవకోట జి.ప్రసాదరావు, ఎంపీపీ ఆరంగి మురళి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడి అంచనాతోనే బీమా వర్తింపు



మాట్లాడుతున్న డీఎస్ఓ నంద

ఎల్.ఎన్.పేట: పంట కోతల ప్రయోగాల్లో వచ్చే పంట దిగుబడుల అంచనాలతోనే రైతులకు పంటల బీమా వర్తింపజేయటం జరుగుతుందని టెక్కలి డివిజన్ డీఎస్ఓ పీసీ నంద అన్నారు. మండలంలోని పెద్దకొల్లివలస గ్రామ సచివాలయంలో పంటకోత ప్రయోగాలపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని ప్రతీ రైతుకు వర్తింపజేయాలన్నారు. మండలంలోని రెవెన్యూ గ్రామాలు, సర్వే నంబర్లు, సబ్ డివిజన్ల వారీగా రైతుల వివరాలను సిద్ధం చేసుకోవాలని సర్వే సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ, ఏఎస్ఓ పి.అప్పలనాయుడు, వీఆర్వో ఎల్.తిరుమలరావు, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులు ఇప్పుడు గుర్తొచ్చారా చంద్రబాబు?



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ తులసీవరప్రసాద్

కొత్తూరు: తమ పాత గ్రామాల్లో ఆఖరి సంక్రాంతిని జీవితంలో గుర్తుండేలా చేసుకుని స్వచ్ఛందంగా వదిలి వెళ్లిపోతామని వంశధార నిర్వాసితులు చెప్పిన మాటలు వినకుండా.. ఎముకలు కొరికే చలిలో బలవంతంగా గెంటివేసిన చంద్రబాబుకు మరళా ఇప్పుడు గుర్తుకు వచ్చారా? అని కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాద్ ప్రశ్నించారు. కొత్తూరు మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వంశధార ప్రాజెక్టు పనులు పూర్తిచేయకుండానే నిర్వాసితులను బలవంతంగా గెంటివేసిన ఘటనలు ఇప్పటికీ తమ కళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. వంశధార ప్రాజెక్టు కోసం, నిర్వాసితుల కోసం మాట్లాడే హక్కు నైతిక హక్కు చంద్రబాబుకు, టీడీపీ నాయకులకు లేదన్నారు. ఈ నెల 10న చంద్రబాబు జిల్లాలో చేయనున్న ప్రాజెక్టుల సందర్శన యాత్రను నిర్వాసితులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్తంగా..

దైవచింతనతో ప్రశాంత జీవితం

పాతపట్నం: దైవచింతన కార్యక్రమాలతో ప్రశాంత జీవితాన్ని పొందవచ్చని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక నీలమణిదుర్గ ఆలయంలో మంగళవారం రాత్రి ధర్మ పథంలో భాగంగా భజన బృందం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రపంచంలో మన దేశానికి ప్రత్యేకమైన స్థానాన్ని చేకుర్చింది ఆధ్యాత్మికమేనన్నారు. గ్రామ సచివాలయ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం, చీకటి రాజు, ఆలయ ధర్మకర్త కృష్ణారావు, భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు

మెళియాపుట్టి: గిరిజనులకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలను ఎమ్మెల్యే రెడ్డిశాంతి తెలిపారు. మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఎమ్మెల్యే మంగళవారం పర్యటించారు. హడ్డివాడ గ్రామంలో ఆదివాసీలతో ముచ్చటించారు. గిరిజనుల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి

పాతపట్నం: మండలంలోని పలు దళిత వాడల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని సింగుపురం గ్రామంలో అంబేడ్కర్ పల్లెబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత వాడల్లో ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సింగుపురంలోని దళితులు ఊట బావిలోని నీటిని తాగుతున్నారని, ప్రభుత్వమే ఇంటింటికీ కుళాయిలు వేయాలన్నారు. మీసాల వెంకటరావు, కోల చిన్నారావు, జగ్గారావు, భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

హిరమండలం: ఈ నెల 10వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 2 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలన్నారు. వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సీహెచ్ఓ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికంగా వృద్ధి చెందాలి

జలుమూరు: స్వయం శక్తి సంఘాల మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని, నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని ఫైనాన్స్ విభాగం ఏపీఎం శ్రీనివాసబాబా అన్నారు. వెలుగు కార్యాలయంలో ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్‌పై గ్రామైక్య సంఘం అధ్యక్షులు, వీఓఎలకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. నిధుల వినియోగం, ఖాతాల నిర్వహణ, పొదుపు, తదతర విషయాలు వివరించారు. ఏసీ కొండలరావు, ఏపీఎం శ్రీనివాసరావు, అధ్యక్షురాలు పిట్ట వనజాక్షి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ స్థానానికి రెండు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న గురుగుబెల్లి జయ

ఆమదాలవలస రూరల్: మండలంలో అక్కివరం గ్రామ సర్పంచ్ స్థానానికి నిర్వహించనున్న ఉప ఎన్నికలకు మంగళవారం రెండు నామినేషన్లు వచ్చాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మెట్ట మోహనరావు తెలిపారు. బీసీ మహిళకు రిజర్వేషన్ కావడంతో మొదటి రోజు గురుగుబెల్లి జయ, తాండ్ర వరలక్ష్మి నామినేషన్లు వేశారన్నారు. అభ్యర్థుల వెంట మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, ఎంపీటీసీ తాండ్ర లక్ష్మి ఉన్నారు.

లంపీస్కిన్‌పై అప్రమత్తంగా ఉండాలి

పొందూరు: పశువులకు వచ్చే లంపీస్కిన్ వ్యాధిపట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి పేడాడ పద్మావతి తెలిపారు. మండలంలోని లైదాం గ్రామంలో మంగళవారం 100 పశువులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. నాలుగు నెలలు దాటిన దూడలతోపాటు అన్ని పశువులకు టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆటల సందడి

నరసన్నపేట: స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో పాఠశాలల్లో ఆటల సందడి మొదలైంది. స్థానిక మంగళవారం ప్రభుత్వ ఉన్నత, బోర్డు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వాలీబాల్‌తో పాటు ఇతర ఆటల పోటీలు నిర్వహించారు. పీడీ కె.గణపతి పోటీలను పర్యవేక్షించారు.

సరుబుజ్జిలి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సరుబుజ్జిలి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బొత్స వెంకటరమణ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.